క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలోని స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. పండితులు నందకిషోర్, విగ్నేష్, సందీప్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సోమవారం ఉదయం యంత్రప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి అనంతరం గ్రామస్తుల సమక్షంలో ఏకశిల ధ్వజస్తంభం ఆలయ ఎదుట భక్తితో ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు రమాకాంత్, నర్సింగ్, అశోక్, గ్రామ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

హరికృష్ణ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఉట్నూర్‌రూరల్: పట్టణ కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ సమావేశాన్ని విజయవంతం చేయాలని బహుజన పట్టభద్రుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్ కోరారు. సోమవారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో సమావేశ కరపత్రాలు విడుదల చేశారు.

దుస్తులు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ధర్మాజీగూడ గ్రామంలో ఆత్రం మాన్వితశ్రీ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుస్తులతో పాటు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలి



సింగాపూర్‌లో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: ప్రతీ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో పర్యటించి గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి కేంద్రంలో చిన్నారుల హాజరు, సరుకుల పంపిణీ విషయం గురించి అడిగి తెలుసుకున్నారు.

తానూరు: నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్వి గ్రామంలో ఉపాధిహామీ ,గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. వివిధ పండ్లు, పూల మొక్కలు పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. వంద రోజులు పూర్తికాని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఎఫ్ఏ నరేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలి

ఖానాపూర్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యా దు చేశారు. హోటళ్లు, చికెన్, మటన్ మార్కెట్లు తదితర చోట్ల విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. యూత్ అధ్యక్షుడు షకీల్, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

జన్నారం: మండలంలోని పొనకల్ గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న మూడెకరాల స్థలాన్ని నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, ఉపాధ్యక్షుడు రాందాస్, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ఉన్నారు.

సామాజిక బాధ్యత ఏది?

- సోషల్ మీడియా వేదికగా అనుచిత పోస్టులు
- వ్యక్తికి భంగం కలిగించే విధంగా కొందరి వ్యవహారం
- చట్టాలను ఉల్లంఘిస్తే కటకటాలపాలే
- అడ్మిన్లు సైతం బాధ్యులు



బోథ్: సోషల్ మీడియాలో సామాజిక బాధ్యత కనిపించడం లేదు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లతో పాటు ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఇష్టానుసారంగా అనుచిత పోస్టులు పెడుతున్నారు. మనోభావాలు దెబ్బతీస్తూ ఫొటోలు, మెసేజ్‌లు పెడితే కటకటాలపాలు కావాల్సి వస్తోంది. సోషల్ మీడియా యూజర్లు ఐటీ చట్టాలను తెలుసుకోకుండా అనుచిత పోస్టులు పెడితే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వ్యక్తిగత దూషణలు..

వాట్సాప్ గ్రూప్‌ల్లో వ్యక్తిగత దూషణలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఓ వ్యక్తిని దూషిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో కొంతమంది పోస్టులు పెడుతున్నారు. దీంతో ఆ వ్యకి మనోభావాలు దెబ్బతింటున్నాయి. గ్రూపుల్లో చర్చలు చేయడంతో వ్యక్తి మానసికంగా కృంగిపోతున్నాడు. సున్నితమైన అంశాలు చర్చనీయాంశంగా మారి అవతలివైపు వారి మనోవేదనకు కారణమవుతున్నాయి. వ్యతిరేక సందేశాలను పదేపదే తలచుకొని భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోతున్న వారు ఎందరో ఉన్నారు. 'సామాజిక మాధ్యమాల' సందేశాలపై గంటల తరబడి ఆలోచించి తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్న వారు ఎందరో ఉన్నారు.

జాగ్రత్త వహించాలి..

వాట్సాప్ గ్రూపుల్లో సామాజిక బాధ్యత పాటించాల్సిన అవసరం ఉంది. పోస్టు చేస్తున్న సందేశంతో ఇతరులు ఇబ్బందులు పడుతున్నా, ఓ వర్గం ఇబ్బందులు పడుతున్నా, ఆ సందేశాన్ని గ్రూపుల్లో పెట్టకపోవడం మంచిది. సోషల్ మీడియాలో చాలామంది బాధ్యతగా ఉండటం లేదు. ఏదీ నిజం, ఏదీ అబద్ధం అనేది తెలుసుకోకుండానే ఇతర గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. దీనివల్ల ఇతరుల పరువుకు భంగం కలుగుతోంది. సోషల్ మీడియాలో పోస్టులు చేసేముందు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు పేర్కొంటున్నారు. సోషల్ మీడియాలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని వారు పేర్కొంటున్నారు. ఒక పోస్టు వల్ల జీవితాలు ఆగమ్యగోచరంగా మారే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

గ్రూప్ అడ్మిన్లు పర్యవేక్షణ అవసరం..

వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు గ్రూప్‌లో పోస్టు చేసే విషయాలను పరిశీలించాలి. తప్పుడు సందేశాలు, మనోభావాలు దెబ్బతినేలా ఉన్న పోస్టులను వెంటనే డిలీట్ చేయాల్సిన అవసరం ఉంది. వివాదాస్పదంగా వ్యవహరించే సభ్యులను గ్రూప్ అడ్మిన్లు హెచ్చరించాలి. నియమాలు అతిక్రమిస్తే వారిని తొలగించాలి. లేదంటే అడ్మిన్లు కూడా చట్టరీత్యా జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి రావచ్చు.

ఇటీవల జరిగిన పలు సంఘటనలు..

- బోథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువురు వాట్సాప్ గ్రూప్‌లో చర్చలు చేసి, ఒకరినొకరు దూషించుకోవడంతో కేసు నమోదైంది.
- బోథ్ మండలంలోని ఓ గ్రూప్‌లో ఓ అధికారిపై ఓ పార్టీకి చెందిన వ్యక్తి గ్రూపులో వ్యాఖ్యలు చేయడంతో అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పుడు సమాచారం షేర్ చేయరాదు



వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారాన్ని షేర్ చేయడంతో పాటు ఇతరులను రెచ్చగొట్టే విధంగా సందేశాలు పంపితే కేసులు నమోదు చేస్తాం. సోషల్ మీడియా యూజర్లు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి. సందేశం పట్ల నిజనిర్ధారణ చేసుకోవాలి. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా అనుచితంగా సందేశాలు పంపరాదు. ఫిర్యాదు అందితే కేసులు నమోదు చేస్తాం.

–ఎల్. ప్రవీణ్ కుమార్, ఎస్సై, బోథ్

చట్టాలపై అవగాహన ఉండాలి



సామాజిక మాధ్యమాలను వాడే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. వాట్సాప్ గ్రూపుల్లో పంపించే సందేశాలు ఇతరులకు ఇబ్బందులు పెట్టకుండా ఉంటేనే పంపించాలి. లేకపోతే ఐటీ చట్టాల ప్రకారం కేసులు నమోదవుతాయి. కొన్ని సందర్భాల్లో గ్రూప్ అడ్మిన్‌లపై కూడా కేసులు నమోదవుతాయి.

– కుమ్మరి విజయ్ కుమార్, అడ్వకేట్, బోథ్

ఎస్సీ వర్గీకరణపై పునఃసమీక్షించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్: ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వం పునఃసమీక్ష చేసేలా ఒత్తిడి తీసుకురావాలని మాల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014 –2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలైన పథకాల్లో మాలలకు మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణను 2024 జనాభా లెక్కల ప్రకారం చేయాలని కోరారు. నాయకులు మేకల మల్లన్న, బేర దేవన్న, సింగరి అశోక్, బొబ్బిలి సుధాకర్, సూరం భగవాండ్లు, దాసరి బాబన్న, పాశం రాఘవేంద్ర, శంకర్ ప్రకాశ్, సుభాష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల మహాయజ్ఞంలో పాల్గొన్న మహిళలు

తలమడుగు: మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో సుదర్శన మహాయజ్ఞం నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొనేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తలమడుగు గ్రామానికి చెందిన డాక్టర్ అల్లూరి సంజీవరావు దుబాయ్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులకు సెలవుపెట్టి సొంత ఊరిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల మహాయజ్ఞం సందర్భంగా వారి దంపతులు మహాయజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 19న నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం, రథోత్సవం రోజున నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ సంజీవరెడ్డి దంపతులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో మహాయజ్ఞం, గరుడ వివాహం, మెహందీ కార్యక్రమం నిర్వహించనున్నారు. వేద పండితులు రాంగోపాల్ చారి, రంగయ్య చారి, శ్రీనివాస చారి, కల్యాణ్ కుమార్, ఆశిశ్ కుమార్, గ్రామ పెద్దలు సంజీవరెడ్డి, రత్నాకర్ రెడ్డి, వెంకటేశ్, రవి, అశోక్, తిరుపతి రెడ్డి, రమేశ్, వెంకన్న, పద్మాకర్ రెడ్డి, రాములు, ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదినం



నేరడిగొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలో తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. జన్మదినాన్ని ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బేల, ఉట్నూర్, బోథ్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

'కుమ్ర డొంగురావ్ మృతి బాధాకరం'



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: గట్టెపల్లి గ్రామ పటేల్ కుమ్ర డొంగురావ్ మృతి బాధాకరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని గట్టెపల్లి గ్రామ పటేల్ కుమ్ర డొంగురావ్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గట్టెపల్లి గ్రామంలో డొంగురావ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ మర్సుకోల అశోక్ తండ్రి మర్సుకోల భీంరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో ఈనెల 6న మృతిచెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోమవారం వాగాపూర్‌లోని మర్సుకోల అశోక్ నివాసానికి చేరుకొని కుటుంబీకులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పటేల్ హన్మంత్‌రావు, మర్సుకోల తిరుపతి, సురేష్, తుడుందెబ్బ మహిళా విభాగం సోయం లలిత, కుడిమేత రాములు, గౌతమ్, తబ్రేజ్ ఖాన్, మెస్రం రవి, చాకటి రాజు ఉన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు



పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన మొరం తరలిస్తున్న టిప్పర్లు

తలమడుగు: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజ్‌మోహన్ సోమవారం హెచ్చరించారు. మండలంలోని కజ్జర్ల, దేవపూర్ గ్రామ శివారు ప్రాంతంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశాల మేరకు పోలీస్ అధికారులతో మొరం తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకున్నామన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వితే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కొంతమంది మొరం వ్యాపారులు రాత్రి సమయంలో మొరం తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వారిపై మైనింగ్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికార సహకారంతో రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసి అక్రమంగా మొరం తరలింపును అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. గతంలోనూ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలించడంతో నాలుగు జేసీబీలను పట్టుకుని దాదాపు రూ.2లక్షల వరకు జరిమానా విధించామన్నారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమ దందా నిర్వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

భూ ఆక్రమణ టోల్‌ఫ్రీ నంబర్‌కు స్పందన

- కేఆర్‌కేలో ఆక్రమణ తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న భూ కబ్జా, ఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 9492164153కు తొలి స్పందన లభించింది. పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు జరుగుతున్నందున జిల్లా కలెక్టర్ రాజర్షి షా టాస్క్‌ఫోర్స్ టీంతో పాటు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. స్థానిక కేఆర్‌కే కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల సమీపంలో గల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని కాలనీకి చెందిన ఓ వ్యక్తి టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారమందించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు ఆదేశాల మేరకు ఆ స్థలాన్ని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ టీం ఆక్రమణను తొలగించివేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలను తొలగించి ట్రాక్టర్‌లో పట్టణంలోని డంపింగ్‌యార్డుకు తొలగించారు. ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని పట్టణ ప్రజలు తమ పరిధిలో ఏమైనా ఆక్రమణలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఆక్రమణల తొలగింపుపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి

జన్నారం: గ్రామపంచాయతీలో గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శుల సంఘం నాయకులు మధు, విశ్వ, రాజన్న, రమేశ్, సాగర్, జలందర్ ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- క్రీడలకు దూరమవుతున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా నాగల్‌కొండ క్రీడా మైదానం

నార్నూర్: ఏజెన్సీ గ్రామాల్లో క్రీడా మైదానాలు లేక గ్రామీణ క్రీడలు కనుమరుగుతున్నాయి. క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే ఉద్దేశంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. నార్నూర్ మండలంలో 23, గాదిగూడ మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ లోపం..

చాలా చోట్ల క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా.. వినియోగంలోకి తీసుకు రాలేదు. ప్రతీ క్రీడా ప్రాంగణం చుట్టూ హరితహారం మొక్కలు నాటాలి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి. వ్యాయామానికి లాంగ్‌బార్ సింగిల్, డబుల్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా వాటిని నిర్మించలేదు. చాలావరకు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పాఠశాల ఆవరణలో నిర్మించారు. దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో విశేష ప్రతిభ దాగుంది. ప్రతీ క్రీడా ప్రాంగణానికి క్రీడా ఉపాధ్యాయుడిని కేటాయించాలి.

– పెందూర్ సంతోష్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి, గాదిగూడ

అధికారులు చొరవ చూపాలి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలని క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలి. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా క్రీడాకారులకు ప్రోత్సాహం అందడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

– పూసం ఈశ్రు, నార్నూర్

దేశీదారు పట్టివేత



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై కలీం

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న దేశీదారు మద్యం బాటిళ్లను భీంపూర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రావుల ఇస్తారి అనే వ్యక్తి ఇంట్లో నిషేధిత దేశీదారు అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్సై కలీం సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. నిషేధిత దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లు 28, 180 ఎంఎల్ బాటిళ్లు 12 మొత్తం 4.68 లీటర్ల దేశీదారు సీజ్ చేశారు. పట్టుకున్న మద్యం విలువ రూ.5వేల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: పట్టణ బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఏలేటి మనోజ్ రెడ్డి (బన్నీ) సోమవారం ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, కమల్ సింగ్, కపిల్ దేవ్, రమేశ్, శంకర్, సద్దాం, లఖన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.